సాక్షి యాదాద్రి భువనగిరి

శనివారం । 20 । సెప్టెంబర్ । 2025



కరెంట్ కష్టాలు
దండుమల్కాపురం గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌లో కరెంట్ కష్టాలతో పారిశ్రామిక వేత్తలు ఇబ్బందులు పడుతున్నారు. - IIలో



విలువలకు నిలయం
కూరెళ్ల విఠలాచార్య సాహిత్యం మానవీయ విలువలకు నిలయమని సురవరం ప్రతాప రెడ్డి విశ్వవిద్యాలయం వీసీ అన్నారు. - IIలో



క్రీడలకు ప్రోత్సాహం
రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. - IIIలో

న్యూస్‌రీల్

శాశ్వత ప్రాతిపదికన ఎంప్లాయ్‌మెంట్ కార్డు

భువనగిరిటౌన్: యువతకు ఎంప్లాయ్‌మెంట్ కార్డు శాశ్వత ప్రాతిపదికన అందించేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి పరాంకుశం సాహితీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో మూడేళ్లకోసారి రెన్యూవల్ చేయించాల్సి ఉండేదని, ఇకనుంచి ఒక్కసారి కార్డు పొందితే శాశ్వతంగా వినియోగంలో ఉంటుందన్నారు. మీసేవ కేంద్రాలు, సెల్‌ఫోన్ లేదా, employment.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన రోజే కార్డు జారీ అవుతుందని, ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని నిరుద్యోగులు, యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కనుల పండువగా ఊంజల్ సేవ



ఆండాళ్‌దేవికి హారతినిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో శుక్రవారం నిత్యారాధనలో భాగంగా ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం కనుల పండువగా నిర్వహించారు.సాయంత్రం అమ్మవారిని బంగారు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం అమ్మవారిని ఆలయంలో ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం లికారు. ఆ తరువాత అమ్మవారిని అద్దాల మండపంలో అధిష్ఠింపజేసి ఊంజల్ సేవోత్సవం నిర్వహించారు. ఇక ప్రధానాలయంలో వేకువ జామున సుప్రభాత సేవ, గర్భాలయంలోని స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు పంచామృతాలతో అభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. అనంతరం ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, వెండి జోడు సేవోత్సవం తదితర పూజలు నిర్వహించారు. వివిధ పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామి, అమ్మవారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

నూతన సంఘాలు ఏర్పాటు చేయాలి

భువనగిరిటౌన్: స్ట్రీట్ వెండర్స్, కిశోర బాలికలు, 60 ఏళ్లు పైబడిన వృద్ధులతో సంఘాలు ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మెప్మా సిబ్బంది, రిసోర్స్ పర్సన్లతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేయించేందుకు కృషి చేయాలని సూచించారు. అదే విధంగా 19నుంచి 29 ఏళ్ల మధ్య ఉన్న నిరుద్యోగులను గుర్తించాలని, వారికి స్కిల్ ట్రెనింగ్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. మధ్యలో చదువు ఆపేసిన వారిని గుర్తించి టాస్ ద్వారా టెన్త్, ఇంటర్, డిగ్రీలో చేరేలా ప్రోత్సహించాలని సూచించారు.స్వస్థనారీ సశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే మెడికల్ క్యాంపులలో మహిళలు పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. బతుకమ్మ చీరల పంపిణీ గురించి వివరించారు. అర్హత కలిగిన ప్రతి మహిళలకు చీరలు పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి, ఆలేరు, యాదగిరిగుట్ట మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాస్, రామలింగం, మెప్మా జిల్లా అధికారి రమేష్‌బాబు పాల్గొన్నారు.





జగదేవ్‌పూర్ చౌరస్తాలో జేసీబీలతో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఆక్రమణల తొలగింపు

భువనగిరిటౌన్ : జిల్లా కేంద్రంలో రహదారుల వెంట ఆక్రమణల తొలగింపు పనులను మున్సిపల్ అధికారులు శుక్రవారం ప్రారంభించారు. ట్రాఫిక్ సమస్య, ప్రమాదాలు అధికంగా జరుగుతున్న తొమ్మిది ప్రాంతాలను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలను తొలగించాలని వీధి వ్యాపారులకు 18వ తేదీ వరకు గడువు ఇచ్చారు. గడువు ముగియడంతో ఆక్రమణలను తొలగిస్తున్నారు. తొలుత జగదేవ్‌పూర్ చౌరస్తాలో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్నారు.

సగం.. సంఘాలకే

ధాన్యం సేకరణలో పెరగనున్న మహిళల భాగస్వామ్యం

- కొనుగోలు కేంద్రాల్లో 50 శాతం స్వయం సహాయక సంఘాలకు అప్పగించాలని నిర్ణయం
- ఆర్థికంగా బలోపేతం అవుతాయన్నది ప్రభుత్వ ఉద్దేశం
- పీఏసీఎస్‌లలో అక్రమాలకూ అడ్డుకట్ట పడే అవకాశం



సాక్షి,యాదాద్రి: ధాన్యం సేకరణలో మహిళల భాగస్వామ్యం మరింత పెరగనుంది. మొత్తం కొనుగోలు కేంద్రాల్లో 50 శాతం స్వయం సహాయక సంఘాల మహిళలకు కేటాయించనున్నారు. దీంతో వారికి కమీషన్ రూపంలో లబ్ధి చేకూరి ఆర్థికంగా బలోపేతం అవుతారన్నది ప్రభుత్వ ఉద్దేశం. అంతే కాకుండా పీఏసీఎస్‌లలో పాలకవర్గాల జోక్యం పెరుగుతోంది. మిల్లర్లతో కుమ్మక్కై తాలు, తేమ, తరుగు పేరుతో రైతులను మోసం చేస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. వీటికి చెక్ పెట్టవచ్చన్నది ప్రభుత్వ ఆలోచన. ఈ సీజన్ నుంచి ఇది అమలుకానుంది.

పెరగనున్న కొనుగోలు కేంద్రాలు

వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు పెరగనున్నాయి. ధాన్యం సేకరణలో స్వయం సహాయక మహిళా సంఘాలకు గతంలో భాగస్వామ్యం ఉన్నప్పటికీ తక్కువ కేంద్రాలను కేటాయించేవారు. గత ఏడాది వానాకాలంలో 85, యాసంగిలో 91 కేంద్రాలు కేటాయించారు. ఈసీజన్ నుంచి సగం వరకు పెంచాలని సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు గతంలో కంటే కొనుగోలు కేంద్రాలను పెంచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ సీజన్‌లో ధాన్యం సేకరణకు 325 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఇందులో 190కి పైగా కేంద్రాలను మహిళలకు కేటాయించే అవకాశం ఉంది.

2024-25 వానాకాలం	
మొత్తం కేంద్రాలు	323
ఐకేపీ	85
పీఏసీఎస్‌లు	225
ఎఫ్‌పీఓలు	13
యాసంగిలో..	
ఐకేపీ	91
పీఏసీఎస్	213
ఎఫ్‌పీఓలు	14
మొత్తం	318



సంఘాలు ఆర్థికంగా బలోపేతం

మహిళా సంఘాలకు ఎక్కువ కేంద్రాలను కేటా యించడంతో కమీషన్ రూపంలో పెద్ద మొత్తంలో లబ్ధి చేకూరి ఆర్థిక స్వావలంభనకు దోహదపడుతుందన్నది ప్రభుత్వ ఆలోచన. ఇందుకోసం పీఏ సీఎస్‌ల పరిధిలో నిర్వహించే కేంద్రాలను తగ్గించి వాటిస్థానంలో ఐకేపీ సెంటర్లు ఏర్పాటు చేయనున్నారు.

పీఏసీఎస్‌లకు రూ.కోట్లలో ఆదాయం

2024–25 వానాకాలం, యాసంగిలో పీఏసీఎస్‌లకు కమీషన్ రూపంలో రూ.12.25 కోట్ల ఆదాయం సమకూరింది. వానాకాలం 2,43,865 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా రూ.7.80 కోట్లు, యాసంగిలో 1,42,177 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా రూ.4.55 కోట్ల ఆదాయం వచ్చింది. క్వింటాకు రూ.32 కమీషన్ రూపంలో ప్రభుత్వం చెల్లిస్తుంది. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు, సిబ్బందికి వేతనాలు పోను మిగిలిన ఆదాయం అంతా పీఏసీఎస్‌ల ఖజానాకే చేరుతుంది. పీఏసీఎస్ కేంద్రాలను తగ్గించి వాటి స్థానంలో ఐకేపీ సెంటర్లను పెంచడం వల్ల స్వయం సహాయక సంఘాలకు ఆర్థికంగా లబ్ధి చేకూరనుంది.


అక్రమాలకు చెక్

పీఏసీఎస్‌లలో పాలకవర్గాల జోక్యం పెరుగుతోంది. మిల్లర్లతో కుమ్మక్కై వివిధ రూపాల్లో రైతులను మోసం చేస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. యాసంగిలో వలిగొండ పీఏసీఎస్ పరిధిలోని గోకారం కొనుగోలు కేంద్రంలో ధాన్యం పెద్ద ఎత్తున పక్కదారి పట్టిన విషయం తెలిసిందే. అధికారులు విచారణ చేయగా అక్రమలు వెలుగుచూశాయి. వీటికి చెక్ పెట్టవచ్చన్నది ప్రభుత్వ ఆలోచన. ఈసారి పీఏసీఎస్ సెంటర్లు తగ్గనున్నాయి.

కేసుల్లేవ్.. సెటిల్‌మెంట్లే!

కాసుల వేటలో ఖాకీలు

- ఫిర్యాదుదారులతో బేరసారాలు
- 'మాట్లాడుకోండి' అంటూ సలహాలు
- ఎప్పుడు కలుస్తారంటూ బాధితులకు ఫోన్లు
- ఇటీవల మితిమీరిపోయిన కొందరు సిబ్బంది అవినీతి



చౌటుప్పల్ రూరల్: వివిధ కేసుల్లో పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారి నుంచి కొంతమంది సిబ్బంది వసూళ్లకు పాల్పడుతున్నారు. చౌటుప్పల్ మండల ప్రాంతం జాతీయ రహదారిపై ఉండడం, రియల్ ఎస్టేట్‌లో, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుండడంతో పలు ఘటనలు, ఫిర్యాదుల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. జాతీయ రహదారిపై జరిగే రోడ్డు ప్రమాదాలు, పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలు, గంజాయి రవాణా, గోవులను తరలించడంతో పాటు అనేక రకాల అక్రమ వ్యాపారం జరుగుతుంటుంది. ఈ వ్యాపారాలను కొందరు పోలీస్ సిబ్బంది తమ ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. ఇవే కాకుండా గ్రామాల్లో జరిగే భూ తగాదాలు, ఘర్షణలు, చోరీ కేసుల్లో రాజీ పేరుతో వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇన్వెస్టిగేషన్ చేసే సిబ్బంది కూడా ఇందులో భాగస్వామ్యం అవుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏదైనా కేసులో ఎవరైనా ఫిర్యాదు చేయడానికి వస్తే నిందితులకు ఫోన్ చేసి.. 'కేసు నమోదవుతుంది..వచ్చి మాట్లాడుకోండి' అని చెబుతున్నారు. వారు రాగానే ఇరువురిని కూర్చోబెట్టి కేసులు వద్దని రాజీ చేసినట్టే చేసి.. ఇరువర్గాల నుంచి దండుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎఫ్ఐఆర్ నమోదు అయ్యిందంటే చాలు.. బాధితులకు ఫోన్ చేసి ఎప్పుడు కలుస్తారని అడుగుతున్నారు. అయితే, పెద్ద క్రైం జరిగినప్పుడు కేసు నమోదు చేసినా కూడా బయటికి రాకుండా ఉండేందుకు డబ్బులు తీసుకుంటున్నట్లు తెలిసింది.

సెటిల్‌మెంట్లలో మచ్చుకు కొన్ని ఇవీ..

- చిన్నకొండూర్ వైపు గ్రామాల్లో బెల్ట్‌షాపుల మీద రైడ్ చేయడానికి వెళ్లి మద్యం పట్టుకుని కేసు నమోదు చేశారు. ఓ వ్యక్తిని బెదిరింపులకు గురిచేసి నిన్ను కోర్టుకు రిమాండ్ చేస్తే లాయర్‌ను పెట్టుకొని బెయిల్ తీసుకోవాల్సి ఉంటుంది. ఆయన ఫీజు రూ.20వేలు తీసుకుంటాడు. నాకు రూ.5 వేలు ఇస్తే స్టేషన్ బెయిల్ ఇస్తాను అని చెప్పి బెల్ట్‌షాపు నిర్వాహకుడి నుంచి డబ్బులు తీసుకొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.
- ఓ పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగితే ఆ పరిశ్రమ యాజమాన్యం నుంచి పెద్ద ఎత్తున డబ్బులు తీసుకున్నట్లు తెలిసింది. నేను ఇచ్చే రిపోర్టు ఆధారంగానే మీ పరిశ్రమపై నమోదయ్యే కేసు ఆధారపడి ఉంటుందని చెప్పి డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలిసింది.
- కైతాపురం గ్రామ స్టేజీ వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురై డ్రైవర్‌తో పాటు మరొకరు మరణించారు. ట్రావెల్స్ బస్సు యాజమాని నుంచి డబ్బులు తీసుకొని బాధితుల వైపు కాకుండా యజమానికి అనుకూలంగా వ్యవహరించారని ఆరోపణలు వచ్చాయి.
- పేకాట ఆడుతున్న వారిని పట్టుకున్నప్పుడు ఆ ఘటనలు బయటికి పొక్కకుండా లోలోపల సెటిల్ చేసి పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. కిందిస్థాయిలో ఓ అధికారి ఈ తతంగం నడిపిస్తున్నట్లు సమాచారం.
- అదేవిధంగా గత నెలలో.. మద్యం షాపు నిర్వాహకులు డబ్బులు తీసుకొని వెళ్తుండగా దారిదోపిడీ జరిగింది. దీనిపై కేసు నమోదు కాలేదు. స్టేషన్‌కు చెందిన పైస్థాయి ధికారులకు సిబ్బంది వసూళ్లలో కొన్ని తెలిసినా పట్టించుకోకపోవడంతో వారి దందా మూడు పూవులు ఆరు కాయలు అన్న చందంగా ఉందని ఫిర్యాదుదారులు వాపోతున్నారు.
- ఓ గ్రామంలో వినాయక నిమజ్జనం రోజు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనకు వచ్చిన మహిళలపై ఆకతాయిలు అసభ్యంగా ప్రవర్తించి దుర్భాషలాడారు. మహిళలపై దాడి చేసి గాయపరిచారు. పోలీసులు మాత్రం ఇరు వర్గాలు కొట్టుకున్నారని కేసు నమోదు చేశారు. తమపై దాడి జరిగిందని ఒక మహిళ ఫిర్యాదు చేయడానికి వస్తే.. కేసులు ఎందుకు, స్టేషన్ చుట్టూ, కోర్టు చుట్టూ తిరగలేవు అని చెప్పి పంపారని, తన ఆవేదన వినలేదని ఆ మహిళ పేర్కొంది.
- ఇటీవల ఓ గ్రామానికి చెందిన యువకుడి బైకు చోరీకి గురికాగా.. బైకును పోలీసులు కనుగొని రికవరీ చేశారు. సదరు యువకుడికి బైక్ ఇవ్వడానికి రూ.5000 డిమాండ్ చేసినట్లు సమాచారం.
- ఓ గ్రామంలోని ఇంట్లో చోరీ జరిగింది. దొంగలు బంగారు ఆభరణాలు, నగదు దోచుకెళ్లారు. దీనిపై బాధితులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు.. బాధితులను పిలిపించి మీ ఇంట్లో అన్ని డబ్బులు పోలేదు.. బంగారం పోలేదని చెప్పాలని వారిని ఒత్తిడి చేసినట్లు తెలిసింది. ఇందులో ఆంతర్యమేమిటో పోలీసులకే తెలియాలి.
- అయితే, ఇవేమీ తమ దృష్టికి రాలేదని, తమ సిబ్బందిపై ఏమైనా ఫిర్యాదులు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటున్నామని స్టేషన్‌కు చెందిన అధికారి చెప్పుకొచ్చారు.

సాంకేతిక విద్యతో ఉజ్వల భవిష్యత్



వివిధ కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందజేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆలేరు: సాంకేతిక విద్య అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. ఆలేరు ఐటీఐలో శుక్రవారం నిర్వహించిన కాన్వకేషన్ కార్యక్రమంలో 2023–25 సంవత్సరానికి గాను వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్‌లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్య పూర్తి చేసిన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఆలేరు ఐటీఐ ఆవరణలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్(ఏటీసీ)ను సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన ఏటీసీని సందర్శించి యంత్రాలను పరిశీలించారు. ప్రభుత్వపరంగా సహకారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఐటీఐ ప్రిన్సిపాల్‌గా అవార్డు పొందిన హరికృష్ణను ఎమ్మెల్యే సన్మానించారు. ఎమ్మెల్యేను ప్రిన్సిపాల్, ఇన్‌స్ట్రక్టర్లు, సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, పలురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో ఉచిత స్క్రీనింగ్ క్యాంప్

బీబీనగర్: స్వస్థనారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలలో శుక్రవారం ఉచితంగా గైనకాలజీ, గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ ఏర్పాటు చేశారు. 30 ఏళ్లు పైబడిన మహిళలకు పరీక్షలు నిర్వహించి గర్భాశయ, క్యాన్సర్ వ్యాధి కారణాలు, లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు.

ఇళ్ల నిర్మాణంలో ముందంజ

బొమ్మలరామారం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఈనెలలో కూడా ఇప్పటి వరకు రాష్ట్రంలో యాదాద్రి జిల్లా ప్రథమ స్థానంలో ఉందని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. బొమ్మలరామారం మండలం రంగాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాకు 9,872 ఇళ్లు మంజూరు కాగా.. అందులో 7,048 ఇళ్లు ప్రగతిలో ఉన్నాయని, 600 ఇళ్లకు స్లాబ్‌లు పూర్తయినట్లు చెప్పారు. పేదలకు ఇళ్ల నిర్మాణం భారం కావద్దనే ఉద్దేశంతో స్వయం సహాయక సంఘాల నుంచి రుణాలు మంజూరు చేయించినట్లు తెలిపారు. నిర్మాణ సామగ్రి ధరల నియంత్రణలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎస్ఐ శ్రీశైలం, ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్ సఫలం అయ్యారని అభినందించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమగ్ర ఓటరు జాబితాపై మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు.



రంగాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

పోచంపల్లి బ్యాంకుకు జాతీయ అవార్డులు

భూదాన్‌పోచంపల్లి: 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను పోచంపల్లి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుకు జాతీయస్థాయిలో బెస్ట్ కో–ఆపరేటివ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బెస్ట్ కాంప్లియన్స్ ట్రాన్స్‌ఫామేషన్ అవార్డులు దక్కాయి. గోవాలో బ్యాంకింగ్ ఫ్రాంటియర్స్ ముంబయి ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జాతీయ కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుల సమ్మేళనంలో గోవా రాష్ట్ర సహకార శాఖ మంత్రి సుభాష్ శిరోద్కర్, జాతీయ అర్బన్ కోఆపరేటివ్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జ్యోతీంద్రభాయి మెహతా చేతుల మీదుగా పోచంపల్లి బ్యాంకు చైర్మన్ తడక రమేష్, సీఈఓ సీత శ్రీనివాస్ అవార్డులు అందుకున్నారు. కాగా పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్‌బ్యాంకు 15 శాఖల ద్వారా వినియోగదారులకు ఉత్తమ సేవలందిస్తుందని, త్వరలో మరో 7 కొత్త బ్రాంచ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు బ్యాంకు చైర్మన్, సీఈఓ వెల్లడించారు. ఈ ఏడాది ఆగస్టు నెలాఖరు వరకు రూ.257.07 కోట్ల డిపాజిట్లు సేకరించి, రూ.202.62 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. జాతీయ బ్యాంకులకు దీటుగా సేవలందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు కర్నాటి బాలసుబ్రహ్మణ్యం, ఏలే హరిశంకర్, సూరెపల్లి రమేశ్, రాపోలు వేణు, గుండు కావ్య, కర్నాటి భార్గవి, కొండమడుగు ఎల్లస్వామి, బిట్టు భాస్కర్, మక్తాల నర్సింహ పాల్గొన్నారు.



అవార్డులు అందుకుంటున్న బ్యాంకు చైర్మన్ తడక రమేశ్, సీఈఓ సీత శ్రీనివాస్ తదితరులు

ఉపాధ్యాయుల్లో 'టెట్' టెన్షన్

అర్హత ఉండాలని సుప్రీంకోర్టు తీర్పు

- పదోన్నతులకూ తప్పనిసరి..
- ఆందోళనలో సీనియర్లు, స్వాగతిస్తున్న జూనియర్లు
- జిల్లాలో మొత్తం ఉపాధ్యాయులు 2,890, టెట్ ఉన్న వారు 813 మంది



భువనగిరి: ఉపాధ్యాయులకు టెట్ (టీచర్ ఎలిజిబుల్ టెస్ట్) టెన్షన్ పట్టుకుంది. ఉద్యోగంలో కొనసాగాలన్నా, పదోన్నతి పొందాలన్నా తప్పనిసరిగా టెట్ అర్హత కలిగి ఉండాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చాలామంది టీచర్లను కలవరపెడుతోంది. ఐదేళ్లకు పైబడి సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులంతా రెండేళ్లలో టెట్ పాస్ కావాలని తీర్పు నివ్వడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

టెట్ అర్హత సాధించిన ఉపాధ్యాయులు 813 మంది

విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయ నియామకాలకు టెట్ తప్పనిసరి చేస్తూ 2010 ఆగస్టు 23న ఎన్‌సీటీఈ(నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్) ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటికే సర్వీస్‌లో ఉన్నవారికి అప్పటి ప్రభుత్వం టెట్ నుంచి మినహాయింపు ఇచ్చింది. ఉమ్మడి రాష్ట్రంలో 2012లో, తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత 2017, 2024లో డీఎస్సీ నిర్వహించారు. ఈ మూడు డీఎస్సీల్లో 678 మంది మాత్రమే టెట్ అర్హత సాధించన వారు ఉన్నారు. రెండేళ్ల క్రితం ఎన్‌సీటీఈ ఉత్తర్వులతో కొందరు అర్హత సాధించారు. ఇందులో సుమారు 135 మంది ఉన్నారు. జిల్లాలో ప్రస్తుతం 2,890 మంది ఉపాధ్యాయులు ఉండగా అందులో టెట్ అర్హత కలిగినవారు 813 మంది మాత్రమే ఉన్నారు. అంటే 2వేల మందికి పైగా టెట్ అర్హత లేదు.

జూనియర్లకు ప్రయోజనం

జిల్లాలో ఏడాది వ్యవధిలో 220 మందికి పైగా ఉపాధ్యాయులు టెట్ అర్హత లేకున్నా జీహెచ్‌ఎంలుగా, పీఎస్‌హెచ్‌ఎంలుగా, స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందారు. సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన తీర్పుతో తర్వాత జరగబోయే పదోన్నతుల్లో జూనియర్లకు మేలు జరగనుంది. దీంతో టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయులు ఎక్కువ మంది డిమాండ్ చేస్తున్నారు.



రివ్యూ పిటిషన్ వేయాలి

టెట్‌కు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని తీర్పును సమీక్షించేలా రివ్యూ పిటిషన్ వేయాలి.విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 23ని సవరిస్తూ 2010 ఆగస్టు తర్వాత ఉద్యోగంలో చేరిన వారికి మాత్రమే టెట్ ఉత్తీర్ణతను తప్పనిసరి చేయాలి. ప్రస్తుతం రాష్ట్రంలో 40 వేల మంది ఉపాధ్యాయులకు టెట్ నిబంధనల నుంచి మినహాయింపు ఇవ్వాలి.

–ముక్కెర్ల యాదయ్య, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

అశాస్త్రీయమైనది



20 నుంచి 30 సంవత్సరాలు బోధన అనుభవం ఉన్న ఉపాధ్యాయులకు టెట్ అర్హత ఉండాలని నిబంధన పెట్టడం సమంజసం కాదు. 2010కి ముందే నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి. ఎందుకంటే ఆయా సమయాల్లో అమల్లో ఉన్న నిబంధనల మేరకు ఉపాధ్యాయులుగా నియామకం అయ్యారు. వారికి టెట్ నిబంధన పెట్టడం అశాస్త్రీయమైంది. 2010 తర్వాత నిర్వహించిన టెట్‌లో లోపాలు ఉన్నాయి. సుప్రీం కోర్టు తీర్పును సవరించుకోవాలని విజ్ఞప్తి.

–ఎస్. లక్ష్మీనర్సింహారెడ్డి, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు



ఎన్‌సీటీఈ రూల్ వర్తింపజేయాలి

2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి. ఎన్‌సీటీఈ రూపొందించిన నిబంధనలు అమల్లోకి వచ్చిన తర్వాత నియమితులైన ఉపాధ్యాయులకు మాత్రమే ఆ నిబంధన వర్తింపజేయాలి. అంతకుముందు ఉన్న ఉపాధ్యాయులచే టెట్ రాయించి పాస్ కావాలని చెప్పడం సరికాదు. వీరికి పదోన్నతుల్లో కూడా అవకాశం కల్పించాలి. టెట్‌లో కామన్‌గా 50 శాతం మార్కులకే ఉత్తీర్ణత అయినట్లుగా నిబంధనలు చేయాలి.

–కె.అమరేందర్‌రెడ్డి, పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

నాణ్యమైన విత్తనంతోనే పంట దిగుబడి

నడిగూడెం : నాణ్యమైన విత్తనంతోనే నాణ్యమైన పంట దిగుబడి వస్తుందని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త రామకృష్ణబాబు తెలిపారు. ఈ ఏడాది రబీ సీజన్ జూన్‌లో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నడిగూడెం మండల పరిధిలోని ఎకలాస్‌ఖాన్‌పేట, రామాపురం, రత్నవరం, చాకిరాల గ్రామాలకు చెందిన రైతులకు వరి కేఎన్‌ఎం 1638 రకం, పెసర ఎంజీజీ 385 విత్తనాలు మినీ కిట్స్ రూపంలో పంపిణీ చేయగా.. శుక్రవారం ఆయా గ్రామాల్లో సాగులో ఉన్న రకాలను ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ఆయన వెంట మండల ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి పిచ్చయ్య, ఏఈఓ గాయత్రి, రైతులు బూత్కూరి వెంకటరెడ్డి, దేవబత్తిని ప్రవీణ్ మారిశెట్టి నర్సింహారావు, మాతంగి స్వామి బాబు ఉన్నారు.

మూర్ఛ వ్యాధితో వలస కూలీ మృతి

చౌటుప్పల్ రూరల్: మూర్ఛ రావడంతో బిహార్ వలస కూలీ మృతి చెందిన సంఘటన చౌటుప్పల్ మండలం ఎస్.లింగోటం గ్రామంలో చోటుచేసుకుంది. బిహార్ రాష్ట్రం గయా జిల్లా ఖాదార్ గ్రామానికి చెందిన గోపి రాజవంశీ (38) భార్య నిర్మల దేవి, ముగ్గురు పిల్లలతో రెండు సంవత్సరాల క్రితం ఎస్.లింగోటం గ్రామానికి వచ్చారు. గ్రామంలోనే కిరాయికి ఇల్లు తీసుకుని రోజువారి కూలీ పనులకు వెళ్లేవాడు. గురువారం గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు మరో కూలీ బికాస్ రాజేష్‌తో కలిసి వెళ్లాడు. సాయంత్రం పని ముగించుకునే సమయంలో ఒక్కసారిగా మూర్ఛరావడంతో కిందపడ్డాడు. వెంటనే చుట్టుపక్కల వారు, తోటి కూలీలు అతడిని లేపి చేతిలో తాళం చెవి ఉంచారు. కొద్దిసేపటికి గోపి లేచి ఇంటికి వెళ్లాడు. ఇంట్లో మరోసారి కిందపడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గ్రామంలోని ఆర్‌ఎంపీ వద్దకు తీసుకువెళ్లగా అప్పటికే అతను మృతి చెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య నిర్మలదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నర్సిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

బంగారు ఆభరణాల చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

హుజూర్‌నగర్ : చోరీ కేసులో ఇద్దరిని హుజూర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను ఎస్‌ఐ మోహన్ బాబు శుక్రవారం వెల్లడించారు. 20 రోజుల క్రితం హుజూర్‌నగర్ మండలంలోని గోపాలపురం గ్రామంలో పేరూరి భాగ్యరాజు ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు బంగారు, వెండి ఆభరణాలు అపహరించారు. అదేరోజు గరిడేపల్లి మండలం ఎల్‌బీ నగర్‌లో కూడా దొంగతనం చేశారు. దర్యాప్తులో భాగంగా కోదాడ పట్టణ శివారులో ఇద్దరు నిందితులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు వారిని అదుపులోకి తీసుకుని, కారును సీజ్ చేశారు. నిందితులు ఏపీలోని ఏలూరు జిల్లా, శనివారపేట మండలం, దొండపాడుకు చెందిన బులసారగంగా శివసాయి యుగంధర్, కాకినాడలోని ఇంద్రపాలెం బృందావనం కాలనీకి చెందిన మూసీనదా గౌరీ మల్లేశ్వరిగా గుర్తించారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మిగతా నిందితులను కూడా పట్టుకుంటామని తెలిపారు.

గల్లంతైన యువకుడి కోసం కొనసాగుతున్న గాలింపు

బీబీనగర్: బీబీనగర్ మండలం గూడూరు గ్రామ పరిధిలోని చిన్నేటి వాగు దాటుతున్న క్రమంలో మేడ్చల్ జిల్లా నాచారం గ్రామానికి చెందిన గండు నరేష్(23) గల్లంతు కాగా.. అతడి ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. గాలింపు చర్యలు రెండు రోజులుగా కొనసాగుతున్నాయి. వాగులో వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో ఆటంకాలు ఏర్పడుతున్నట్లు రెస్క్యూ టీం తెలిపారు.

ఇండస్ట్రియల్ పార్క్‌లో కరెంట్ కష్టాలు

- తరచూ విద్యుత్ అంతరాయంతో ఉత్పత్తి భారం
- గత మూడు రోజులుగా ఎదురవుతున్న ఇబ్బందులు


దండుమల్కాపురంలోని ఇండస్ట్రియల్ పార్క్

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ పరిధిలో హరిత పారిశ్రామిక పార్కుగా రూపుదిద్దుకున్న గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌లో కరెంట్ కష్టాలతో పారిశ్రామిక వేత్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటులో భాగంగా 33 /11 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. ఇప్పటికి అందులో సుమారు 500 పైగా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. పరిశ్రమలకు డిమాండ్‌కు తగ్గట్లు విద్యుత్ సరఫరా కావడం లేదని పారిశ్రామిక వేత్తలు పేర్కొంటున్నారు.

వేడి చేసే ప్రక్రియలో ఇబ్బందులు

గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌లో గత మూడు, నాలుగు రోజులుగా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడడంతో ఉత్పత్తిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోజులో సుమారు ఐదారు సార్లు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో ఉత్పత్తిలో వేడి చేసే ప్రక్రియలో ఇబ్బంది ఏర్పడుతోంది. తిరిగి ఉత్పత్తి ప్రారంభించినప్పటికీ మళ్లీ వేడి కావడానికి సుమారు 40నిమిషాల సమయం తీసుకుంటుంది. ఈ దశలో ఉన్న ఉత్పత్తులు ప్రాసెస్ చేయడానికి విద్యుత్ అదనపు భారంతో పాటు ఖర్చు అధికమవుతుందని పారిశ్రామిక వేత్తలు పేర్కొంటున్నారు. పారిశ్రామిక పార్క్‌లో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఫీడర్ ఏర్పాటు చేసే క్రమంలో అంతరాయం ఏర్పడింది

ఇండస్ట్రియల్ పార్క్‌లో ఉన్న సబ్‌స్టేషన్‌కు ఒకటే ఫీడర్ ఉంది. వాతావరణంలో ఇబ్బందులు ఎదురైనప్పుడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా రెండో ఫీడర్ ఏర్పాటు చేస్తున్నాం. ఈ పనులు చేయడానికి విద్యుత్ సరఫరాను నిలపాల్సి వచ్చింది. పారిశ్రామికవేత్తలు వారి సమస్యలను మా దృష్టికి తేవడంతో సమస్యను పరిష్కరించాం. ఇక నుంచి అలాంటి సమస్య ఏర్పడదు.

– సతీష్, విద్యుత్ ఏఈ, చౌటుప్పల్

వాతావరణ మార్పులపై అవగాహన అవసరం

- యాక్షన్ ఎయిడ్ ప్రోగ్రాం లీడ్ డాక్టర్ ఇర్ఫాన్

భువనగిరి: వాతావరణ మార్పులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని యాక్షన్ ఎయిడ్ ప్రోగ్రాం లీడ్ డాక్టర్ ఇర్ఫాన్ పేర్కొన్నారు. శుక్రవారం భువనగిరిలోని ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాలలో యాక్షన్ ఎయిడ్ కర్నాటక ప్రాజెక్టు ఆధ్వర్యంలో వాతావరణ మార్పులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రకృతి, పర్యావరణ పట్ల అవగాహన కల్పించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. శబ్ద, వాయు కాలుష్య నివారణతో పాటు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి అడవుల విస్తీర్ణం పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యాక్షన్ ఎయిడ్ కర్నాటక ప్రాజెక్టు కమ్యూనిటీ ట్రైనర్ సురుపంగ శివలింగం, ప్రిన్సిపాల్ వెంకన్న, వైస్ ప్రిన్సిపాల్ శ్యాం బాబు, యాక్షన్ ఎయిడ్ వలంటీర్లు చంద్రకళ, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ ఇర్ఫాన్

భూనిర్వాసితులకు అండగా నిలుస్తాం

- మాజీ మంత్రి కేటీఆర్


రీజనల్ రింగ్ రోడ్డు భూనిర్వాసితులతో సమావేశమైన కేటీఆర్

చౌటుప్పల్ : రీజినల్ రింగ్ రోడ్డు భూనిర్వాసితులకు అండగా నిలుస్తామని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ.రామారావు హామీ ఇచ్చారు. భూనిర్వాసితులతో శుక్రవారం తెలంగాణ భవన్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఉత్తర, దక్షిణ భాగాలకు చెందిన నిర్వాసితుల సమస్యలు, డిమాండ్‌లను అడిగి తెలుసుకున్నారు. రైతులు, భూ నిర్వాసితులు చేస్తున్నది న్యాయ పోరాటమన్నారు. నిర్వాసితులకు బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని తెలిపారు. కొందరి ప్రయోజనాల కోసం రీజినల్ రింగ్‌రోడ్డును వంకలుగా తిప్పారని ధ్వజమెత్తారు. సామాన్య, మధ్య తరగతి రైతులను రోడ్డున పడేస్తూ పారిశ్రామిక వేత్తలు, బడాబాబుల కోసం పని చేస్తున్న ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ నెల 21న మరోసారి నిర్వాసితులు, రైతులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు దూదిమెట్ల బాలరాజు, పల్లె రవికుమార్, పార్టీ సీనియర్ నాయకుడు చెరుకు సుధాకర్, నాయకులు సుర్వి యాదయ్య, దబ్బటి రాములు, భూనిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.

కూరెళ్ల సాహిత్యం మానవీయ విలువలకు నిలయం

- తెలుగు విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ నిత్యానందరావు


మాట్లాడుతున్న నిత్యానందరావు

రామన్నపేట: పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య సాహిత్యం మానవీయ విలువలకు నిలయమని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ వెల్దండ నిత్యానందరావు అన్నారు. శుక్రవారం రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య సాహిత్యం సమాలోచనం అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచమంతా నగరాల వైపు పరుగులు తీస్తున్న సమయంలో పల్లె పట్టుల్లో సాహిత్య పరిమళాలలను వెదజల్లడమే కాకుండా గ్రంథాలయం ఏర్పాటుతో పుస్తకాలకు ప్రాణం పోస్తున్న మహనీయుడని కొనియాడారు. కూరెళ్ల రెండులక్షల పుస్తకాలతో ఏర్పాటు చేసిన గ్రంథాలయం పరిశోధక విద్యార్థులకు వరమని పేర్కొన్నారు. కూరెళ్ల సమగ్ర సాహిత్యాన్ని సదస్సు ఆవిష్కరించిందని తెలిపారు. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి మాట్లాడుతూ.. ప్రజలు తమ దృష్టిని మొబైల్ నుంచి పుస్తకం వైపు మళ్లించి బతికించుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే సాహిత్యంపై అభిరుచిని కలిగించాలన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య పిల్లలమర్రి రాములు, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య సాగి కమలాకర్‌శర్మ మాట్లాడుతూ.. యువత మహనీయులను జీవితగాధలను చదివి స్ఫూర్తిని పొందాలన్నారు. మూడుస్థాయిల్లో జరిగిన సమావేశాల్లో కూరెళ్ల సాహిత్యంలోని వేర్వేరు అంశాలపై 25మంది పత్ర సమర్పకులు(పరిశోధకులు) ఉపన్యసించారు. కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య డాక్టర్ రహత్‌ఖానం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సదస్సు సంచాలకుడు, తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, సహ సంచాలకుడు అద్దంకి ఆంజనేయులు, సాహితీవేత్తలు డాక్టర్ బెల్లి యాదయ్య, రఘు, రఘువీర్ ప్రతాప్, గోవర్ధనాచారి, పోరెడ్డి రంగయ్య, వెల్దండి శ్రీధర్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు ఢీకొని బాలుడి మృతి

- పాఠశాల ఎదుట కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల ధర్నా


గౌతమ్ (ఫైల్)


పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు

పెద్దవూర: బాలుడిని స్కూల్ బస్సు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. కర్నూలు జిల్లా పెద్ద కడబూరు మండలం కంబాలదిన్నె గ్రామానికి చెందిన కుమ్మరి చంద్రశేఖర్ తన భార్య శ్రీదేవి, ఇద్దరు పిల్లలతో కలిసి గత ఆరు నెలలుగా పెద్దవూర మండల కేంద్రంలోని రంగప్పకాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. చంద్రశేఖర్ గ్రామాల్లో కిరాణ దుకాణాలకు సరుకులను బైక్‌పై తీసుకెళ్లి విక్రయిస్తుంటాడు. వీరి పెద్ద కుమారుడు గౌతమ్ చక్రశాలి(7) మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో యూకేజీ చదువుతున్నాడు. ప్రతీరోజు పాఠశాలకు స్కూల్ బస్సులోనే వెళ్తుంటాడు. గౌతమ్ గురువారం ఉదయం స్కూల్ బస్సు ఎక్కేందుకు రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో బస్సు డ్రైవర్ బాషిపాక అశోక్ బాలుడిని గమనించకుండా బస్సును ముందుకు పోనివ్వడంతో గౌతమ్ రోడ్డుపై పడిపోయాడు. ఈ క్రమంలో బస్సు ముందు టైరు విద్యార్థిపైకి ఎక్కడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆస్పత్రికి, అక్కడి నుంచి నల్లగొండలోని నిమ్స్‌కు తరలించారు. హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా.. పరిస్థితి విషమంగా ఉండటంతో నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. బాలుడి తండ్రి చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు పాఠశాల బస్సు డ్రైవర్ అశోక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రసాద్ శుక్రవారం తెలిపారు.

న్యాయం చేయాలని ధర్నా

డ్రైవర్ నిర్లక్ష్యంతోనే తమ కుమారుడు మృతి చెందాడని, తమకు న్యాయం చేయాలని శుక్రవారం పాఠశాల ఎదుట మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులతో పాటు విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, ఎంఎస్‌ఎఫ్ జిల్లా కో ఆర్డినేటర్ ముందిగొండ వెంకటేశ్వర్లు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు జగదీష్, రమేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదిమళ్ల సత్యనారాయణ, చిన్న, నాగార్జున, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ విచారణ

కలెక్టర్ ఆదేశానుసారం జిల్లా విద్యాశాఖాధికారి భిక్షపతి శుక్రవారం పాఠశాలలో విచారణ చేపట్టారు. సంఘటన స్థలానికి వెళ్లి ప్రత్యక్ష సాక్షులతో మాట్లాడారు. అనంతరం పాఠశాలకు చేరుకుని రికార్డులను పరిశీలించారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఉషశ్రీ స్కూల్ బస్సుకు సంబంధించిన ఫిట్‌నెస్, ఇన్సూరెన్సు, పొల్యూషన్, బస్సు కండిషన్‌ను పరిశీలించారు.

భర్తను కడతేర్చిన భార్య

- కుమారుడితో కలిసి భర్త మర్మాంగాలపై దాడి చేసి, ఉరేసి ఆత్మహత్యగా చిత్రీకరణ
- అనుమానంతో ఇద్దరిని విచారించిన పోలీసులు
- హత్య చేసినట్లు అంగీకరించడంతో రిమాండ్‌కు తరలింపు


వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ రాజశేఖర్

చివ్వెంల(సూర్యాపేట) : మద్యానికి బానిసైన భర్తను అతడి భార్య, కుమారుడితో కలిసి హత్య చేసింది. ఈ సంఘటన చివ్వెంల మండల పరిధిలోని కుడకుడ గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. కుడకుడ గ్రామానికి చెందిన పారెల్లి సురేష్ (40) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య శైలజ సూర్యాపేటలోని పారా మెడికల్ కళాశాలలో అటెండర్‌గా పని చేస్తోంది. సురేష్ మద్యానికి బానిసై ప్రతిరోజు భార్యతో గొడవ పడుతుండేవాడు. ఈనెల 17న భార్యతో గొడవపడ్డాడు. ఈక్రమంలో భార్యతోపాటు, కుమారుడిని కొట్టాడు. అతడి బాధలు భరించలేక భార్య, తన కుమారుడితో కలిసి సురేష్ మర్మాంగాలపై దాడి చేసి చంపేశారు. అనంతరం చున్నితో ఇంట్లోని బెడ్ రూంలో ఉరేసి, ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారు. తన భర్త ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని 18వ తేదీన భార్య స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు ఎస్‌ఐ మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోస్టుమార్టం అనంతరం సురేష్‌ది ఆత్మహత్య కాదని, హత్య అని అనుమానం రావడంతో శైలజను, ఆమె కుమారుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. తన కుమారుడితో కలిసి తామే హత్య చేసినట్లు వారు అంగీకరించారు. దీంతో ఆమెతో పాటు, ఆమె కుమారుడిపై కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఆత్మహత్యలు జరిగితేనే జీతాలు వేస్తారా

- బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు


మధు ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు

సూర్యాపేటటౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆత్మహత్యలు జరిగితేనే జీతాలు వేస్తారా అని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గజ్జి రాంబాబు ప్రశ్నించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆరు నెలలుగా జీతాలు లేకపోతే వారు తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలన్నారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రాష్ట్ర బృందంతో కలిసి శుక్రవారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేతనాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగి మధు ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొండి వైఖరి మానుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివశంకర్, మెడికల్ అండ్ హెల్త్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీ, జిల్లా అధ్యక్షుడు చికూరి అశోక్, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్ గౌడ్, ముదిరెడ్డి అనిల్ రెడ్డి, అమరవాది శ్రవణ్ పాల్గొన్నారు.

అప్పులు తీర్చలేక వ్యక్తి బలవన్మరణం

చిట్యాల: మద్యానికి బానిసైన వ్యక్తి అప్పు తీర్చలేక బలవన్మరణానికి పాల్పడ్డాడు. శుక్రవారం చిట్యాల ఎస్‌ఐ మామిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేటకు చెందిన పెద్దబోయిన రాజు(42) తన కుటుంబసభ్యులతో కలిసి గత మూడు నెలలుగా తన అత్తగారి గ్రామమైన చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. రాజు ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఏ పని చేయకుండా కుటుంబ అవసరాలకు అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక ఇబ్బందులు పడుతూ జీవితంపై విరక్తి చెందాడు. శుక్రవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు అతడిని ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు. మృతుడి భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం


హనుమంతరెడ్డి (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్: సైకిల్‌ను వెనుక నుంచి కారు ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేట గ్రామానికి చెందిన గిరెడ్డి హనుమంతరెడ్డి (65) గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం తన వ్యవసాయ బావి వద్ద పొలం పనులు ముగించుకుని సైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో రాజాపేట మండలం నుంచి యాదగిరిగుట్ట వైపునకు వెళ్తున్న కారు అతివేగంతో, హనుమంతరెడ్డి సైకిల్‌ను వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో హనుమంతరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ సాయంతో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, కారుతో ఢీ కొట్టిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు రాజాపేట మండలం చల్లూరు గ్రామానికి చెందిన కనకయ్యగా గుర్తించినట్లు యాదగిరిగుట్ట సీఐ భాస్కర్ తెలిపారు.

నగదు చోరీ కేసులో నిందితుడికి జైలు

గుర్రంపోడు : మండల కేంద్రంలోని వైన్‌షాపులో గతేడాది జరిగిన చోరీ ఘటనలో నిందితుడైన బెంగుళూరుకు చెందిన రమేష్ బిస్తూకు 18 నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జడ్జి హరీష్‌బాబు తీర్పునిచ్చినట్లు ఎస్‌ఐ మధు శుక్రవారం తెలిపారు. షాపు యజమాని నర్సింహారావు ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసులో వాదనలు వినిపించిన ఏపీపీ సంతోష్‌కుమార్‌ను, ఎస్సై మధు, కోర్టు లైసన్ ఆఫీసర్ శ్రవణ్‌కుమార్‌ను ఎస్పీ అభినందించారు.

ఆర్థిక ఇబ్బందులతో చేనేత కార్మికురాలు ఆత్మహత్య

గట్టుప్పల్ : ఆర్థిక ఇబ్బందులతో చేనేత కార్మికురాలు బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. అప్పం యాదమ్మ (54) భర్త కొన్నేళ్ల క్రితం మృతిచెందాడు. వారికి ముగ్గురు కుమారులు. ఇద్దరు కుమారులు బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వలస వెళ్లగా, రెండవ కుమారుడితో కలిసి యాదమ్మ గ్రామంలోనే ఉంటూ చేనేత వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఇంటి నిర్మాణం కోసం కొంతకాలం క్రితం ప్రైవేట్ బ్యాంకులో లోన్ తీసుకుంది. చేతి నిండా పని లేకపోవడంతో ఆర్థిక సమస్యలు మొదలయ్యాయి. ఇంటికి తెచ్చిన అప్పు నెలనెలా ఈఎంఐ చెల్లించడానికి బయట మళ్లీ అప్పులు చేసింది. అప్పులకు వడ్డీలు పెరగటం, కుటుంబ పోషణ భారంగా మారడంతో మనోవేదనకు గురైంది. గురువారం రాత్రి ఇంట్లోనే బాత్రూంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి పంచనామా చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంజీవరెడ్డి తెలిపారు.

మహిళ అదృశ్యం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మహిళ అదృశ్యమైన సంఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. యల్లాపురం గ్రామానికి చెందిన గడగోజు లక్ష్మమ్మ(53) తనకు ఆరోగ్యం బాగోలేదని గుర్రంపోడు మండలంలో దేవుడి వద్ద చూపించుకొని వస్తానని చెప్పి ఈనెల 12న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో లక్ష్మమ్మ కుమారుడు సైదాచారి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కీటకాలు.. పంటలకు హితకారులు


సాలీడు


తూనీగ


మిడత



పెద్దవూర: సాలీడు పురుగులు, మిడతలు, తూనీగలను రైతు మిత్రులు, పంట రక్షిణులు, పంట కాపరులు అని అన్నదాతలు పిలుస్తుంటారు. బస్తాల కొద్దీ రసాయనిక మందుల్ని పంట పొలాల్లో గుమ్మరించటం వలన ఇవి కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. తగిన మోతాదులో మందుల్ని వాడకుండా ఇష్టారాజ్యంగా వాడితే ఇవి పూర్తిగా చనిపోయి దుష్ఫలితాలు ఏర్పడతాయని మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ సూచిస్తున్నారు. పంటలకు మిత్రులైన వీటిపై ఆయన సలహాలు..

ఎగిరే శత్రువులకు సింహస్వప్నం

మిడతలు, చిలకలు, సీతాకోక చిలుకలు వంటి ఎగిరే ప్రాణుల్ని ఈ సాలీడు ఆరగించదు. ఆలస్యంగా స్థిరపడినప్పటికీ అన్ని రకాల పర్యావరణాల్లోనూ ఈ సాలీడు మనగ గలదు.

శత్రు గుడ్లను కబళించే అక్షంతల పురుగులు

నెమ్మదిగా సంచరించే పురుగులను ఇవి తింటాయి. బయటకు కనిపించే వివిధ జాతి శత్రు పురుగుల గుడ్లను కబళిస్తాయి. ఇవి చురుగ్గా కదులుతూ పిల్ల గొంగళి పురుగులు, పచ్చదోమ పిల్ల పురుగులు, కనిపించే గుడ్లను భక్షిస్తాయి. ఇది పచ్చదోమ, సుడిదోమ పిల్లలను ప్రీతిగా తింటుంది. వీటి పిల్ల పురుగులూ అతి తిండిపోతులుగా చెప్పవచ్చు.

ఈ సాలీడుకు దవడలెక్కువే

మాగాణి భూముల్లో ఉండే ఈజాతి సాలీళ్లు మధ్యాహ్న సమయంలో వరి పైరులో సేదదీరి ఉదయాన్నే గూటిలో మాటు వేసి, గూటిని తాకే ఎగిరే ప్రాణుల్ని అమాంతం ఆక్రమించి సిల్కుతో చుట్టేసి ఆరగిస్తాయి.

రాత్రిళ్లు వేటాడే భక్షక మిడత

ఎదిగిన పైరులో రాత్రి వేళల్లో చురుగ్గా సంచరించి కాండం తొలిచే పురుగు గుడ్లు, వరి నల్లనల్లి గుడ్లు, పచ్చదోమ, సుడిదోమ పిల్లల్ని కబళిస్తుంది. యవ్వన మిడతలు అలికిడి విన్నంతనే వెంటనే ఎగిరిపోతాయి. ఒక్కో భక్షక మిడత రోజుకు 3, 4 కాండం తొలిచే పురుగుల గుడ్ల సముదాయాల్ని భక్షించగలదు.

శత్రు పురుగుల్ని తినే సాలీళ్లు..

దీపపు పురుగులు, ఆకులను తినే గొంగళి పురుగులు, కాండం తొలుచు పురుగు, పెద్ద రెక్కల సీతాకోక చిలుకలను, ఉల్లికోడు, వరి ఈగలను, రెల్లరాల్చు పురుగు, సుడి దోమలను ఎంతో సులువుగా సాలీళ్లు భక్షిస్తాయి. ఒక్కో సాలె పురుగు 5–15 వరకూ శత్రు కీటకాలను ఒక రోజులో తినగలదు.

కీటకాలు, దోమల శత్రువులు తూనీగలు

పెద్ద, చిన్న తూనీగలు రంగురంగుల ఉలిపిరి రెక్కలతో మొక్కల పైభాగమునకు దిగువగా ఎగురుతూ ఎగిరే కీటకాలు, దోమ పిల్లల కోసం వెతుకుతూ ఉంటాయి. వీటి పిల్ల పురుగులు నీటిలో ఆవాసం ఉంటాయి. వరి కాండంపై సులభంగా సంచరిస్తూ పిల్ల దోమలను వేటాడుతాయి.

శత్రువులను అదుపు చేసే తోడేలు సాలీడు

వరి పిలకల దశలో ఈ జాతి సాలీళ్లు ఎక్కువగా మొదళ్ల మధ్య సంచరిస్తాయి. మాగాణి భూములు, మెట్ట వరి పొలాల్లో శత్రు పురుగులపై దాడి చేసి పంట నష్టపరిచే స్థాయికి ఎదగకుండా అదుపు చేస్తాయి.

శత్రు పురుగుల తరాన్ని నివారించే శివంగి సాలీడు

కొత్త తరం పెంపొందకుండా శత్రు పురుగులను నివారించడంలో ప్రధాన భూమికను పోషిస్తుంది శివంగి సాలీడు.

పొట్టిదైనా గట్టి సాలీడు

ఈ సాలీళ్లు నీటి మట్టంపైన వరి పిలకల మొదళ్ల మధ్య నల్లి గూళ్లలో చిక్కిన పచ్చదోమ, సుడిదోమ పిల్లలను ఆరగిస్తాయి.

ముసుగు యుద్ధం చేసే దుమికే సాలీడు

చుట్టుకుపోయిన ఆకులోనే చిన్నపాటి గూడును ఏర్పరచుకుని మరో ఆకును కూడా అల్లుకుని దాక్కుని, దీపపు పురుగుల కోసం నిరీక్షిస్తుంది. అదును దొరికాక సంహరిస్తుంది.